సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 1 । ఆగస్టు । 2024



బలహీనంగా సాగర్ కాల్వ కట్ట

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్ట పలుచోట్ల బలహీనంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



హామీల అమలులో విఫలం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలసమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీజేపీ నాయకులు విమర్శించారు. - 9లో



తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

శిశువుకు తల్లిపాలు పట్టించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ చంద్రకళ పేర్కొన్నారు. - 9లో

'స్త్రీనిధి' సొమ్ము స్వాహా!

రూ.కోటికి పైనే పక్కదారి

- సభ్యులు కిస్తులు చెల్లించినా బ్యాంకు ఖాతాల్లో జమచేయని సిబ్బంది
- బకాయిలు లేకుండా ఉంటేనే మహిళా శక్తి రుణాలు
- ఆందోళనలో స్వయం సహాయక సంఘాలు



సాక్షి, యాదాద్రి : స్వయం సహాయక సంఘాలకు అత్యవసర సమయంలో ఉపయోగపడాల్సిన 'స్త్రీ నిధి' సొమ్ము పక్కదారి పడుతోంది. సభ్యులు తాము తీసుకున్న రుణాలకు సంబంధించి ప్రతి నెలా చెల్లిస్తున్న వాయిదా డబ్బులను వారికి తెలియకుండా కాజేస్తున్నారు. మెప్మా, సెర్ప్ విభాగంలోని కొంతమంది అధికారులు, సిబ్బంది, ఆఫీస్ బేరర్లు (అధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షురాలు, సహాయ కార్యదర్శి,కోశాధికారి) కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. 2018–19 ఆర్థిక సంవత్సరం నుంచి నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. కాగా సభ్యులు తీసుకున్న రుణబకాయిలు జూలై 31వ తేదీ వరకు క్లియర్‌గా ఉంటేనే ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకం కింద రుణాలు మంజూరు కానున్నాయి. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో మొత్తం సంఘాలు, సభ్యులు

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో జిల్లాలో 4,747 సంఘాలు నడుస్తున్నాయి. వాటిలో 22,139 మంది సభ్యులు ఉన్నారు. కాగా 2018–19 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు జూలై నాటికి ఆయా సంఘాల్లోని సభ్యులు కిస్తులు చెల్లించకుండా రూ.30.51 కోట్ల వరకు బకాయి ఉన్నారు. ఇందులో సంబంధిత అధికారులు, సిబ్బంది రూ.1 కోటికి పైగా దుర్వినియోగానికి పాల్పడ్డారు. సభ్యులకు తెలియకుండానే వారి పేరున స్త్రీనిధి రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు రుణం తీసుకున్న సభ్యులు చెల్లించిన కిస్తీ డబ్బులు బ్యాంకులో జమచేయకుండానే దాటవేశారు. కిస్తుల వసూళ్లలో కొన్నేళ్లుగా మెప్మా, సెర్ప్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లే నిధులు పక్కదారి పట్టడానికి కారణంగా చెప్పుకోవచ్చు.

డిఫాల్ట్ సంఘాలకు గడ్డుకాలం

ప్రభుత్వం తాజాగా మహిళా శక్తి పథకం అమలు చేస్తోంది. ఇందులో వివిధ రకాల రుణాలను ఇచ్చి మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకుపోయే ప్రయత్నం ప్రారంభించింది. అయితే స్త్రీనిధి బ్యాంకు రుణాల కిస్తులు చెల్లిస్తేనే మహిళా శక్తి రుణాలు ఇచ్చే అవకాశం ఉంది. బకాయి పడ్డ సంఘాలకు కొత్తరుణాల వచ్చే పరిస్థితి లేదు.

వారంలో చెల్లించాల్సిందే..



స్త్రీనిధి రుణం కిస్తు డబ్బులను దుర్వినియోగం చేసిన వారికి గత నెలలో నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదు. మరోసారి నోటీసులు జారీ చేస్తాయి. స్పందించని వారిని ఉద్యోగం టర్మినేట్ చేస్తాం. మెప్మా, సెర్ప్ పరిధిలో స్త్రీనిధి రుణాలకు సంబంధించి చెల్లింపులు 40 శాతం వరకు నిలిచిపోయాయి. బకాయిల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ పెట్టాం. సిబ్బంది దుర్వినియోగం చేస్తే వారే చెల్లించాలి. సభ్యులు చెల్లించపోతే సిబ్బంది వారితో మాట్లాడి చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

–కృష్ణన్, డీఆర్‌డీఓ

దుర్వినియోగమైన నగదు ఇలా..

స్త్రీ నిధి పథకం కింద రుణం తీసుకున్న సభ్యుల్లో కొందరు కిస్తులు క్రమంతప్పకుండా చెల్లించగా, మరికొందరు బకాయి పడ్డారు. ఇందులో మెప్మా పరిధిలో భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీల్లో 629 సంఘాల్లోని 3,259 మంది సభ్యులు రూ.4.13 కోట్లు బకాయి పడ్డారు.

- సెర్ప్ పరిధిలోని 17 మండలాల పరిధిలో 4,118 సంఘాలున్నాయి. సంఘాల సభ్యులు రూ.26.38 కోట్లు కిస్తులు చెల్లించాల్సి ఉంది.
- ఆలేరు పట్టణ ఫెడరేషన్ ఆలేర్–2, వినాయక, మోత్కూరు–6, మోత్కూరు –1 ఏరియా పెడరేషన్‌లో రూ.17,72,106లో ఓబీ,వీఓఏ,ఆర్పీలు దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. వీటిలో రూ.8.63,679 రికవరీ చేశారు. ఇంకా రూ.9,08,427 వసూలు చేయాల్సి ఉంది.
- మండల సమాఖ్య పరిధిలో యాదగిరిగుట్ట, మోత్కూరు, గుండాల, వలిగొండ, చౌటుప్పల్,రాజాపేట, అడ్డగూడూరు, తుర్కపల్లి, ఆత్మకూర్‌ఎం, భువనగిరి, మోటకొండూరు, ఆలేరులో 28 సంఘాల్లో రూ. 82.53లక్షల వరకు పక్కదారి పట్టాయి. వీటిలో రూ.24.37.353 మాత్రమే రికవరీ చేశారు. రూ.58,16,557 రాబట్టాల్సి ఉంది. వలిగొండ వీఓ–5 లో రూ.90 లక్షలు, రాజాపేట వీవో –2లో వీవోఏ రూ.3.02,744, గొల్నేపల్లిలో వీఓ–2లో మాజీ వీవోలు, ఆఫీస్ బేరర్లు కలిసి రూ.5.84,993 దుర్వినియోగం చేశారు. ఇందులో రూ.1.40 లక్షలు రికవరీ అయ్యాయి. రూ.4.44,993 రికవరీ చేయాల్సి ఉంది.

నృసింహుడికి లక్ష పుష్పార్చన



శ్రీస్వామి, అమ్మవారికి పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఏకాదశి కావడంతో ఆలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తులకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. రకరకాల పూలతో శ్రీస్వామి, అమ్మవార్లను అర్చిస్తూ ఆరాధన, పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆయలంలో ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఓపెన్ యూనివర్సిటీ ప్రాక్టికల్స్

రామగిరి (నల్లగొండ): డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ సైన్స్ కోర్సుల విద్యార్థులకు గురువారం నుంచి నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నట్లు కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4, 6వ సెమిస్టర్ కెమిస్ట్రీ, జియాలజీ పరీక్షలు గురువారం నుంచి 4వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. అలాగే, 5 నుంచి 8 వరకు బోటనీ, మ్యాథ్స్, జువాలజీ, ఫిజిక్స్, 1 నుంచి 12 వరకు కంప్యూటర్ అప్లికేషన్స్ ప్రాక్టికల్స్ జరగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయని పేర్కొన్నారు.

మమ్మల్ని వదిలి వెళ్లొద్దు..



టీచర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న విద్యార్థినులు

మోత్కూరు : తమతో ఎంతో ఆప్యాయతగా ఉండే టీచర్ ఉన్నత ఉద్యోగంలో చేరడానికి వెళ్తుండగా విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. వెళ్లొదంటూ కన్నీటి వేడుకున్నారు. ఈ సంఘటన మోత్కూరులోని కేజీబీవీలో చోటు చేసుకుంది. ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న జె.కృష్ణవేణి అనతి కాలంలో విద్యార్థుల అభిమానాన్ని చూరగొంది. ఆమెకు రామన్నపేట మండలం జనంపల్లి గురుకుల పాఠశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయగా వెళ్లొద్దంటూ విద్యార్థినులు భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు.

పలువురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ

నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్- 1, గ్రేడ్- 2 వారిని బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. నల్లగొండ సబ్ రిజిస్ట్రార్–1గా పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి హుజూర్‌నగర్‌కు, నల్లగొండలో ఏఆర్వీగా పనిచేస్తున్న రఘువర్దన్ నల్లగొండ–1 సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. నల్లగొండలోనే సబ్ రిజిస్ట్రార్–2గా పనిచేస్తున్న అలివేలు మంగను నల్లగొండ ఆడిట్ విభాగంలో సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. రామన్నపేట సబ్ రిజిస్ట్రార్ పి.నగేష్ నల్లగొండ సబ్ రిజిస్ట్రార్–2గా బదిలీ అయ్యారు. భువనగిరి సబ్ రిజిస్ట్రార్ శ్రీను చండూరుకు, నకిరేకల్ సబ్ రిజిస్ట్రార్ అన్వేషితను జనగామకు, చౌటుప్పల్ నుంచి సాయి వికాస్‌ను దేవరకొండకు, చండూరులో పనిచేసే అనూషను యాదగిరిగుట్టకు, యాదగిరిగుట్ట నుంచి కిషోర్‌ను కొడకండ్ల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. దేవరకొండలో పనిచేసే సందీప్‌ను చౌటుప్పల్‌కు బదిలీ చేశారు. కోదాడలో పనిచేసే అశోక్ మోత్కూర్‌కు, మిర్యాలగూడలో పనిచేసే అరవింద్ కోదాడకు బదిలీ అయ్యారు. బీబీనగర్‌లో పనిచేసే బలరాంను మిర్యాలగూడకు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పనిచేసే నరేష్ బీబీనగర్‌కు బదిలీ అయ్యారు. కాగా, నల్లగొండ ఆడిట్ విభాగంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మధుకర్‌ను నల్లగొండ ఏఆర్వీ విభాగానికి బదిలీ చేశారు.

వర్టూర్‌లో కేంద్ర బృందం



మహిళా సంఘాల సభ్యులతో సెక్షన్ ఆఫీసర్లు

మోటకొండూర్ : కేంద్ర సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం బుధవారం మోటకొండూరు మండలం వర్టూర్‌లో పర్యటించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పర్యటించి ప్రజల జీవన స్థితిగతులను అధ్యయనం చేసింది. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం, పీహెచ్‌సీ, మహిళా సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించి నిర్వహణ తీరుపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, వైద్యులు విజయ్, సత్యనారాయణ, బాల్ద భవానీ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు 18 వరకు అవకాశం

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో గల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్‌లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 18 వరకు అవకాశం ఉందని కళాశాల దూరవిద్య సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ సమాన డిప్లమో ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులని,ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఏ, బీకాం, బీఎస్సీ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ మీడియంలలో అడ్మిషన్లు పొందవచ్చని, ఇతర వివరాలకు సెల్ 9553568049, 7382 929758 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పంట రుణాలు రెన్యూవల్ చేయండి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భూదాన్ పోచంపల్లి : రుణమాఫీ పొంది రైతులకు వెంటనే పంట రుణాలు రెన్యూవల్ చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లిలోని కెనరా బ్యాంకును సందర్శించారు. బ్రాంచ్ ద్వారా ఎంతమందికి రుణమాఫీ జరిగిందని, రుణమాఫీ జాబితాను ప్రదర్శించారా.. అని మేనేజర్ భిక్షమాచారిని అడిగి తెలుసుకున్నారు. కొర్రీలు పెట్టకుండా రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జాప్యం చేయకుండా రుణాలు మంజూరు చేయడం వల్ల ఎరువులు, కూలీల ఖర్చు, వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం రుణమాఫీ జాబితాను చెక్ చేశారు. కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని బ్యాంకు మేనేజర్ కలెక్టర్‌కు దృష్టికి తీసుకురాగా.. వారి వివరాలను గ్రీవెన్స్‌లో మండల వ్యవసాయాధికారి ద్వారా పంపించాలని సూచించారు. బ్యాంకు వద్దకు వచ్చిన ప్రసాదం అంజయ్య అనే రైతును నీకు రైతు రుణమాఫీ అయ్యింది, ఎంత మాఫీ జరిగిందని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏజాజ్ అలీఖాన్, ఏఈఓలు శ్వేత, శిరీష తదితరులు పాల్గొన్నారు.



జిబ్లక్‌పల్లిలో కెనరాబ్యాంక్ మేనేజర్‌తో రైతు రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

మార్కండేయనగర్‌లో పాఠశాల తనిఖీ

భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మార్కండేయనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పనుల పురోగతిని మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలని ఆదేశించారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని, మురుగు నీరు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వదలాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు.

గంట వ్యవధిలోనే పాఠశాల ఆవరణ క్లీన్

మార్కండేయనగర్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ .. పాఠశాల ఆవరణలో గడ్డి, పిచ్చిమొక్కలను గమనించారు. వెంటనే తొలగించాలని ఆదేశించడంతో అధికారులు స్పందించారు. మున్సిపాలిటీ నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని రప్పించి సాయంత్రంలోపు గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, కమిషనర్ వీరారెడ్డి, ఏఈ శ్రీరాములు ఉన్నారు.



పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సైకిళ్లపై గస్తీ.. జనంతో దోస్తీ



సైకిళ్లపై గస్తీ తిరుగుతూ మాదకద్రవ్యాల నిషేధంపై యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భువనగిరి క్రైం : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు సిబ్బంది వాహనాల్లోనే కాకుండా సైకిళ్లపైనా గస్తీ తిరుగుతూ పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా భువనగిరి రూరల్ పోలీసులు బుధవారం భువనగిరి మండలంలోని అనంతారం, ముత్తిరెడ్డిగూడెం, పగిడిపల్లి గ్రామాల్లో సైకిళ్లపై గస్తీ తిరిగారు. ప్రజలతో మమేకమై వారి శాంతిభద్రతల పరిరక్షణలో వారికి సూచనలు చేశారు. ముఖ్యంగా యువతకు మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వల్ల అనర్థాలు, అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

'స్కిల్' యూనివర్సిటీ ఏర్పాటు చేయండి

- ముఖ్యమంత్రికి బూర నర్సయ్యగౌడ్ లేఖ

సాక్షి, యాదాద్రి : తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో ఏర్పాటు చేయాలని భువనగిరి మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధికల్పన అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఎజెండాగా పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ మినిస్ట్రీ ఏర్పాటు చేసి పలు చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ఇటీవల ప్రకటించిందని పేర్కొన్నారు. 100 ఎకరాల సువిశాల స్థలంలో స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ ఉందని, స్కిల్ యూనివర్సిటీకి ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఇక్కడ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఖర్చు తగ్గటమే కాకుండా, త్వరగా కార్యరూపందాల్చడానికి దోహదపడుతుందన్నారు. మౌళిక సదుపాయాల కల్పనకు తక్కువ ఖర్చు అవుతుందన్నారు. 1995లో అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రభుత్వం పరిశీలన చేసి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు.

మూడంచెల్లో క్రీడా పోటీలు

- స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో నూతన విధానం
- మండల, జిల్లా, జోనల్ స్థాయిలో పోటీలు
- రెండో వారం నుంచి ప్రారంభం

భువనగిరి : విద్యార్థి దశ నుంచే ఆటలపై ఆసక్తి పెంపొందించి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఏటా ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలు నిర్వహిస్తోంది. అయితే ఈసారి మూడంచెల విధానంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విడుదల చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు క్రీడా పోటీల నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. నెల 30న సన్నాహక సమావేశం నిర్వహించారు.

నూతన విధానం ఇలా..

స్కూల్ ఫెడరేషన్ విధానంలో ఈసారి మూడంచెల విధానం అమలు చేయనున్నారు. గతంలో నేరుగా జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేవారు. ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి పంపేవారు. మండల స్థాయిలో నిర్వహించకపోవడంతో చాలా మంది విద్యార్థులు ప్రతిభ ఉన్నా నష్టపోయేవారు. ఈసారి ఆవిధంగా కాకుండా అండర్–14, అండర్–17 విభాగాల్లో పాఠశాల, అండర్–19 విభాగంలో ఇంటర్ విద్యార్థులకు మండల, జిల్లా, జోన్‌ల (ఉమ్మడి జిల్లా) స్థాయిలో పోటీలు జరగనున్నాయి. మొదటగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. ప్రతిభ చాటిన వారిని జిల్లాస్థాయి, ఇక్కడ సత్తాచాటిన వారిని జోనల్ స్థాయికి పంపుతారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు.



ఆటలు ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

షెడ్యూల్ ఇలా..

ఈనెల రెండు, మూడవ వారంలో మండల స్థాయి, సెప్టెంబర్ రెండో వారంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు సెప్టెంబర్ నెలాఖరులో జరిగే అవకాశం ఉంది. కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు,156 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలు 32 వరకు ఉన్నాయి. వాటిలో 60వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..



షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తాం.పీడీ, పీఈటీలు, సీనియర్ క్రీడాకారుల సహకారంతో గ్రామీణ, పట్టణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నాం. ఈ క్రీడా పోటీల వల్ల ఎంతోమంది ప్రతిభ చాటి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

–బాలకృష్ణ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి

54 మంది ఎస్‌జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతి

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా జిల్లాలో మరో 54 మంది ఎస్‌జీటీలకు పదోన్నతి లభించింది. వీరికి స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ)గా అవకాశం కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో అదనపు విద్యార్హతల ఆధారంగా కొందరు ఉపాధ్యాయులకు రెండు, మూడు సబ్జెక్టుల్లో పదోన్నతులు దక్కాయి. అలాంటి వారు తమకు కేటాయించిన పోస్టుల్లో చేరగా 54 ఖాళీలు ఏర్పడ్డాయి. వాటికి సంబంధించి పదోన్నతులు చేపట్టి సీనియార్టీ జాబితాలో ఉన్నవారికి అవకాశం కల్పించారు. ఇందులో స్థానిక సంస్థలకు చెందిన పాఠశాలల నుంచి 51, ప్రభుత్వ పాఠశాలల్లో ముగ్గురు ఉన్నారు. వీరంతా 15 రోజుల్లో తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతిభావంతులను గుర్తించడమే లక్ష్యం

- యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయనేయులు, డీఈఓ ప్రశాంత్‌రెడ్డి

భువనగిరి : వినూత్న ఆలోచనలకు సృజనాత్మకత తోడైతే అద్భుతమైన ఆవిష్కరణలు సృష్టించవచ్చని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయనేయులు, ఇంచార్జ్ డీఈఓ ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభావంతులను గుర్తించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఇంటింటా ఇన్నోవేటర్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి చేపట్టిన వాక్ ఫర్ ఇన్నోవేషన్ ర్యాలీని వారు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలు వయస్సుతో నిమిత్తం లేకుండా ఆవిష్కరణలు పంపవచ్చన్నారు. ప్రతి ఒక్కరిలో వచ్చిన కొత్త ఆలోచనలు నూతన ఆవిష్కరణలకు దారి తీస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యువతీయువకులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్ జిల్లా కో ఆర్డినేటర్ సుదీర్, రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, యూత్ కో ఆర్డినేటర్ కరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



భువనగిరిలో వాక్ ఫర్ ఇన్నోవేషన్ ర్యాలీని ప్రారంభిస్తున్న ధనుంజయనేయులు, ప్రశాంత్‌రెడ్డి

అప్పుడొక మాట.. ఇప్పుడొక మాటా?

- యాదాద్రి ఉద్యోగులను ఎందుకు బదిలీ చేయొద్దో అయిలయ్యే చెప్పాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఎమ్మెల్యే కాకముందు అప్పటి ప్రభుత్వాన్ని కోరిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య.. ఇప్పుడు వద్దనడంలో ఆంతర్యం ఏమిటని? సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రశ్నించారు. ఉద్యోగులను ఎందుకు బదిలీ చేయకూడదో.. ఆయనే సమాధానం చెప్పాలన్నారు. యాదాద్రి ఉద్యోగులను బదిలీ చేయొద్దని అసెంబ్లీ సమావేశాల్లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను విప్ బీర్ల అయిలయ్య కోరిన నేపథ్యంలో బుధవారం యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న యాదాద్రి ఉద్యోగులకు బదిలీలు ఎందుకు వర్తించవని ప్రశ్నించారు. ఇక్కడి ఉద్యోగులు గతంలో భద్రాచలం, వేములవాడ క్షేత్రాలకు బదిలీలపై వెళ్లారని, ఇప్పుడు ఆపాలనడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ మాట్లాడుతూ.. యాదాద్రి పునర్నిర్మాణంలో అవినీతి, అక్రమాలు, ఉద్యోగులను బదిలీలపై బీర్ల అయిలయ్యతో కలిసి పోరాటం చేశామని గుర్తు చేశారు. యాదాద్రిలో పనిచేస్తున్న ఉద్యోగులు స్థానికంగా ఎవరూ ఉండడం లేదన్నారు. వాటర్ సెక్షన్‌లో ఓ ఉద్యోగికి నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతి కల్పించారని ఆరోపించారు. అంతేకాకుండా ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో విద్యుత్ విభాగం ఈఈని కాదని, వాటర్ సెక్షన్ ఉద్యోగితో సంతకాలు పెట్టించి రూ.60 లక్షలు బిల్లులు డ్రా చేశారని పేర్కొన్నారు. విద్యుత్ విభాగం ఈఈ అక్రమాలపై కోర్టుకెళ్తామన్నారు. ఆలయ ఉద్యోగుల బదిలీలు జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, సభ్యులు బబ్బూరి శ్రీధర్, పేరబోయిన పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, పేరబోయిన బంగారు, నర్సమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఆలయంలో కేంద్ర మంత్రి పూజలు



పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి ఆలయంలోని అర్చకుడు ఆశీర్వచనం అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొంది కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా ఆలయానికి వచ్చి మొక్కు చెల్లించుకున్నట్లు తెలిసింది. ఆయన వెంట ఆలయ మేనేజర్ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



రమేష్ (ఫైల్)

కొండమల్లేపల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మంగళశారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దేశముఖోనికుంటకు చెందిన ఏకుల రమేష్(36) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి అతడు కొండమల్లేపల్లి నుంచి తన స్వగ్రామం దేశముఖోనికుంటకు బైక్‌పై వెళ్తుండగా.. చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని ఉద్యానవన కేంద్రం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

బొమ్మలరామారం: పళ్లు తోముకోవాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన కొడుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండలంలోని మాల్యాల గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన కొమ్ము డానియల్, మరియమ్మ దంపతులు తమ ముగ్గురు కొడుకులతో కలసి గత కొన్నేళ్లుగా బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామ సమీపంలోని ఓ మామిడి తోటకు కాపలాగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వారి చిన్న కుమారుడు కొమ్ము చంద్రశేఖర్ బొమ్మలరామారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం చంద్రశేఖర్ పళ్లు తోముకోకుండా అన్నం తింటున్నాడు. దంతాలను శుభ్రం చేసుకోకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయని తల్లి మరియమ్మ చంద్రశేఖర్‌ను మందలించింది. దీంతో కుటుంబ సభ్యులను తిట్టుకుంటూ చంద్రశేఖర్ తోట పక్కనే గల మరో మామిడి తోటలోకి వెళ్లి చీరతో ఉరేసుకున్నాడు. తోటలోని కాపరి గమనించి మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే చంద్రశేఖర్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

బలహీనంగా సాగర్ ఎడమ కాల్వ కట్ట





అన్నపరెడ్డిగూడెం-వేములపల్లి మధ్య అధ్వానంగా ఎడమ కాల్వ

పలుచోట్ల అధ్వానంగా కాల్వ లైనింగ్

- గతంలో నిడమనూరు వద్ద పడిన గండితో నీట మునిగిన వందల ఎకరాలు
- ప్రస్తుతం చేపడుతున్న మరమ్మతుల పనుల్లోనూ కొరవడిన నాణ్యత
- రేపు కాల్వలకు నీళ్లు వదిలే అవకాశం
- మరోసారి గండి పడితే పంట, ప్రాణ నష్టం తప్పదంటున్న రైతులు

మిర్యాలగూడ: కృష్ణా నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో అధికారులు నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. రేపు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వలకు నీటిని వదిలే అవకాశం ఉంది. అయితే సాగర్ ఎడమ కాల్వ కట్ట పలుచోట్ల బలహీనంగా ఉండడంతో ఎక్కడ గండి పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. 2022 సెప్టెంబర్‌లో నిడమనూరు మండల పరిధిలో ఎడమ కాల్వకు గండి పడడంతో వందలాది ఎకరాలు నీట మునిగాయి. అధికారులు, సిబ్బంది తప్పిదంతోనే ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటన తర్వాత నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో ఎడమ కాల్వ మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించగా.. లైనింగ్, బెడ్డింగ్ పనులను ఈ ఏడాది ఏప్రిల్ వరకు పూర్తిచేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించింది. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తుండడంతో ఎడమ కాల్వకు మరో గండి పడే అవకాశం లేకపోలేదని రైతులు అంటున్నారు.

కాల్వ మరమ్మతులకు రూ.44.78కోట్లు..

సాగర్ ఎడమ కాల్వకు మరమ్మతుల కోసం గత ప్రభుత్వం రూ.44.78కోట్లు కేటాయించింది. నల్లగొండ జిల్లాలో 1.89కి.మీ. నుంచి 73.800కి.మీ. వరకు రూ.15.78కోట్లు, సూర్యాపేట జిల్లాలో 74కి.మీ. నుంచి 133కి.మీ. వరకు రూ.29కోట్లు కేటాయించగా కాంట్రాక్టర్ పనులను ఆలస్యంగా, నాసిరకంగా చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ ఆలస్యంగా పనులు చేస్తుండడంతో ఇంకా 20శాతం పనులు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం పలు చోట్ల లైనింగ్, ఫ్లోరింగ్ దెబ్బతినడంతో రూ.30కోట్లతో అధికారులు మళ్లీ ప్రతిపాదనలు పంపారు. నాణ్యత లోపం వల్ల పలు చోట్ల లైనింగ్ వేసిన కొద్దిరోజులకే ధ్వంసమైపోతుంది. నల్లగొండ జిల్లా పరిధిలో ఎడమ కాల్వపై మొత్తం 30 యూటీలు (కాల్వ కిందుగా వర్షం నీరు ప్రవహించేవి) ఉండగా ప్రస్తుతం ఐదు యూటీల వద్ద మరమ్మతు పనులు చేస్తున్నారు.

85శాతం పనులు పూర్తి

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ లైనింగ్, ఫ్లోరింగ్ పనులు 85శాతం మేర పూర్తయ్యాయి. మిగిలిన పనులు మరో మూడురోజుల్లో పూర్తిచేస్తాం. మట్టి వదులుగా ఉండడంతో ఒక చోట కొత్తగా వేసిన లైనింగ్ కిందకి జారిపోయింది. అక్కడ మరమ్మతులు చేపడుతున్నాం. కురియాతండా వద్ద లైనింగ్ పనులు మూడు రోజుల్లో పూర్తవుతాయి.

– లక్ష్మణ్, ఎన్‌ఎస్‌పీ ఈఈ, మిర్యాలగూడ

మొత్తం 54 మేజర్లు..

ఎడమ కాల్వ పరిధిలో మొత్తం 54 మేజర్లు ఉండగా నల్లగొండ జిల్లాలో 30, సూర్యాపేట జిల్లాలో 24 మేజర్లు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో మేజర్ల కింద 98,030 ఎకరాలు, 31 ఎత్తిపోతల పథకాల కింద 47,690 ఎకరాల సాగు భూమి ఉంది. సూర్యాపేట జిల్లాలో మేజర్లు ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 2.35లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నల్లగొండ జిల్లాలో రాజవరం, సూరేపల్లి, నార్కెట్లగూడ, ముదిమాణిక్యం, వజీరాబాద్, కిష్టాపురం, ముల్కలకాల్వ మేజర్ల కింద 2వేల ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగి ఉన్నాయి. ప్రధాన కాల్వ ద్వారా 11వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉండగా మేజర్లకు గరిష్ఠంగా 156క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉంది. 2010లో సుమారు రూ.440కోట్లతో చేపట్టిన ఎడమ కాల్వ ఆధునీకరణ పనులకు నిధులు సరిపోక పూర్తిచేయకపోవడంతో మేజర్ల లైనింగ్ మధ్యలో ఆగిపోయింది. అన్ని మేజర్లు, కాల్వలకు లైనింగ్, ఫ్లోరింగ్ చేయడం ద్వారా నీరు వృథాకాకపోవడంతో పాటు చివరి భూములకు సైతం నీరందించే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.



మిర్యాలగూడ మండల కురియాతండా వద్ద దెబ్బతిన్న ఎడమ కాల్వ లైనింగ్



అన్నపరెడ్డిగూడెం-వేములపల్లి మధ్యన తూము వద్ద కాల్వ లైనింగ్ దుస్థితి ఇదీ..

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ

దేవరకొండ: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ ఘటన బుధవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామంలో జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల.. కొండభీమనపల్లి గ్రామానికి చెందిన కనకటి లక్ష్మమ్మ తన ఇంటి వద్ద కూర్చొని ఉండగా.. గుర్తుతెలియని వ్యక్తి కారులో వచ్చి కొన్ని మంచినీళ్లు ఇవ్వమని ఆమెను అడిగాడు. దీంతో లక్ష్మమ్మ ఇంట్లో నుంచి మంచినీళ్లు తెచ్చి ఇస్తుండగా సదరు వ్యక్తి ఆమె మెడలోని తులం బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. లక్ష్మమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం, సారా పట్టివేత



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: అక్రమంగా తరలిస్తున్న బెల్లం, సారాను బుధవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలంలోని వెల్లటూరు కాలనీకి చెందిన దాసు వీరబాబు తన టాటా ఇంట్రా వాహనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నుంచి 120 కిలోల బెల్లం, 5లీటర్ల సారా తీసుకొస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున చింతలపాలెం మండలం దొండపాడు వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాసు వీరబాబుపై, అతడికి బెల్లం అమ్మిన జగ్గయ్యపేటకు చెందిన వ్యాపారి సంక వెంకటరావుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నాగరాజు, రవి, రుక్మారెడ్డి, నాగయ్య, గోపిరెడ్డి, సంజయ్, నవీన్, మధు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

- కిలో గంజాయి, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను కనగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి బుధవారం కనగల్ ఎస్‌ఐ రామకృష్ణ, సీఐ వెంకటయ్యతో కలిసి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలో బృందావన్ కాలనీకి చెందిన పెద్దగోని అరవింద్, గుర్రంపోడు మండలం చేపూర్ గ్రామానికి చెందిన సీతా వంశీ, కొమ్ము అనిల్, కనగల్ మండలం ఎడవెల్లి గ్రామానికి చెందిన చిన్నపాక అరుణ్‌కుమార్ స్నేహితులు. వీరంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో గంజాయి కొనుగోలు చేసి దానిని కనగల్ మండలం దర్వేశిపురం వద్ద ఇతరులకు విక్రయించేందుకు వేచి ఉండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు కనగల్ ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి కిలో గంజాయి, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరాలో భాగస్వాములైన రవికిరణ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని, పురం గణేష్ అనే మరో వ్యక్తి జైలులో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి తాగేవారు, విక్రయించే వారి వివరాలను 8712670266 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది రమేష్, సురేష్, వెంకన్న, వీరయ్య, సర్వరాజ్, వెంకట్‌రెడ్డి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఆత్మహత్య



రమణారెడ్డి (ఫైల్)

మిర్యాలగూడ: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. వాడపల్లి ఎస్‌ఐ రవి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కంచరకుంట్ల రమణారెడ్డి(39) స్థానికంగా పాత ఇనుప సామాను దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య సుమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్ని రోజులుగా రమణారెడ్డికి, అతడి భార్య మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం సైతం ఇంట్లో ఇరువురి మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో రమణారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన రమణారెడ్డి తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి వరుసకు సోదరుడైన చిట్యాల మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తలకు గాయం ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆస్పత్రిలో రమణారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

రూ.9లక్షలు, 12 తులాల బంగారు ఆభరణాలు చోరీ

- 30 తులాల వెండి వస్తువులు కూడా ఎత్తుకెళ్లిన దుండగులు

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ పంచాయతీ మదిర గ్రామమైన బొర్రోళ్లగూడెంలో భారీ దొంగతనం జరిగింది. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బొర్రోళ్లగూడేనికి చెందిన ములుగు ప్రభాకర్ తన సమీప బంధువు చనిపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లాడు. అంత్యక్రియలు రాత్రి 11గంటలకు పూర్తవ్వడంతో కుటుంబ సభ్యులు అందరూ అక్కడే ఉండిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని పగులగొట్టి లోనికి ప్రవేశించి రూ.9లక్షలు, 12 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పక్కింట్లో నివాసముంటున్న మల్లేష్ దొంగతనం జరిగినట్లు గుర్తించి ప్రభాకర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఇంటికి చేరుకున్న ప్రభాకర్ డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు

బొమ్మలరామారం: కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఆటోను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బొమ్మలరామారం మండల కేంద్రంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బొడ్డెల్లి బాలయ్య(54) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం స్వగ్రామం నుంచి ఆటోలో తన కుటుంబ సభ్యులతో కలసి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కుషాయిగూడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బొమ్మలరామారం మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద హైదరాబాద్ నుంచి బొమ్మలరామారం వైపు వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బాలయ్యతో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో బాలయ్య మృతిచెందాడు. కారు డ్రైవర్ వేమూరి హరిబాబుకు సైతం గాయాలయ్యాయి. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



వినయ్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కానుగంటి వినయ్(20) హైదరాబాద్‌లోని బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 25వ తేదీన సాయంత్రం వంగపల్లి గ్రామంలోని తన నివాసం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై బయల్దేరాడు. మార్గమధ్యలో వంగపల్లి గ్రామ శివారులో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై వ్యవసాయ కూలీలను తీసుకుని గ్రామానికి చెందిన ఆటో రాంగ్‌రూట్‌లో వస్తుంది. ఈ క్రమంలో ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వినయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని షెడ్‌లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో లేదా ఆస్పత్రి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.



చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో విజయవాడ-హైదరాబాద్ హైవేపై బుధవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొనడంతో పట్టణ కేంద్రంలో భారీగా నిలిచిపోయిన వాహనాలు

– చౌటుప్పల్

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. పలువురికి గాయాలు

పెద్దవూర: మండల కేంద్రం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుమలగిరి(సాగర్) మండలం గరికెనెట్‌తండాకు చెందిన సపావత్ శ్రీనునాయక్ బైక్‌పై జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి గుండా హాలియా నుంచి పెద్దవూర వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో పెద్దవూర మండల కేంద్రం సమీపంలో రోడ్డు విస్తరణలో పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో పోసిన మట్టి, రాళ్ల కుప్పల పైకి బైక్‌ను పోనిచ్చాడు. ఈ క్రమంలో శ్రీను పక్కనే ఉన్న పెద్ద బండరాయిపై పడటంతో అతడి తల, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ పి. వీరబాబు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసు వాహనంలోనే నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు.

సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు మార్గమధ్యలో దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఎంఎస్‌ఆర్ కాలేజీ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.



చివ్వెంల: సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు

రెండు కార్లు ఢీ..

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. విజయపురి టౌన్ ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల నుంచి కారులో నాగలక్ష్మి, దినకర్ హైదరాబాద్‌కు వెళ్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి సిద్దార్థ, రాజు, సతీష్, సంతోష్ మాచర్లకు వెళ్తున్న కారులో వెళ్తున్నారు. ఈ రెండు కార్లు విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో గల మూలమలుపు వద్ద ఎదురెదురుగా కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. కార్లు రోడ్డుపైనే ఉండటంతో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రెండు కార్లలో ఇరుక్కుపోయిన వారిని బయటకు లాగి ఆస్పత్రికి తరలించారు. కార్లను రోడ్డు పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. క్షతగాత్రులను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



నాగార్జునసాగర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా..

మునుగోడు: భూవివాదం పరిష్కారం కోసం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటన మునుగోడు మండలం కొంపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగింది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి గ్రామానికి చెందిన గంజి శివ, గంజి పరమేష కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వారిద్దరు పాలివారు కాగా.. గ్రామంలో ఉన్న ఐదెకరాల భూమి విషయంలో ఇరు కుటుంబాల మధ్య గత 10 ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. వివాదం నడుస్తున్న భూమిలో గంజి శివ ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. ఇరువురు పెద్దమనుషులను ఆశ్రయించగా.. బుధవారం గ్రామ పెద్దలు ఇరువురిని హైదరాబాద్ నుంచి పిలిపించి మాట్లాడేందుకు ప్రయత్నించారు. కానీ వారి మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో తిరిగి మధ్యాహ్న సమయంలో హైదరాబాద్‌కు బయల్దేరారు. గంజి పరమేష తనతో పాటు వచ్చిన ఓ వ్యక్తిని తీసుకొని బైక్‌పై వెళ్లగా.. ఆ వెంటనే కారులో గంజి శివ బయల్దేరాడు. అయితే గ్రామ శివారులోని ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో శివ కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లగా.. బైక్‌పై వెళ్తున్న పరమేషకు స్వల్ప గాయాలు, అతని వెంట ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు గమనించి క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.